శుక్రవారం 17 మే 2024 5 అనంతపురం

జెఎన్‌టియులో స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంత ఎస్పీపై వేటు..!

◆ మరికొందరు కిందిస్థాయి అధికారులపైనా చర్యలకు ఆదేశం ◆ అల్లర్లు జరిగిన చోట ప్రత్యేక కేంద్ర బలగాలు

ఎస్పీ అమిత్ బర్దర్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికల అనంతరం తాడిపత్రిలో వరుసగా ఘర్షణలు చోటు చేసుకోవడంపై ఎన్నికల సంఘం సీరియస్‌గా తీసుకుంది. అనంతపురం జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ గురువారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. ఈయనతోపాటు దిగువ స్థాయి అధికారులపైనా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దీంతో జిల్లాలో అల్లర్లు జరిగిన ప్రాంతంలోనున్న డివిజన్ల స్థాయి అధికారులపైనా చర్యలుండే అవకాశముంది. అల్లర్లను అణచివేయడంలో విఫలమైన అధికారులెవరన్నది తేల్చేందుకు ప్రత్యేకమైన విచారణను చేపట్టేందుకు ఒక కమిటీని నియమించాలని పేర్కొంది. బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర స్థాయిలో ముగ్గురు అధికారులపై ఇటువంటి ఉత్తర్వులివ్వగా ఇందులో అనంతపురం జిల్లా ఎస్పీ కూడా ఉండటం విశేషం. వాస్తవానికి అమిత్ బర్దర్ ఎన్నికల సంఘం నియామకం మేరకు ఇక్కడికి వచ్చారు. ఏపీఎస్పీ కమాండెంట్‌గానున్న అమిత్ బర్దర్‌ను ఎన్నికల నోటిఫికేసన్ తరువాత నియమించారు. అంతకు మునుపున్న జిల్లా ఎస్పీ అన్బురాజన్‌పై ఆరోపణలతో ఆయన్ను బాధ్యతల నుంచి తప్పించారు. ఆ స్థానంలో అమిత్ బర్దర్‌ను ఎన్నికల సంఘం నియమించింది. బాధ్యతలు చేపట్టాక శాంతియుతంగా ఎన్నికల నిర్వహణపై చర్యలు తీసుకున్నారు. ఎన్నికల్లో ఎక్కడా ఆయనపై రాజకీయపరమైన ఆరోపణలేవి రాలేదు. అయితే ఎన్నికల రోజు తాడిపత్రిలో టిడిపి, వైసిపి వర్గీయుల మధ్య చెలరేగిన ఘర్షణను అణచివేయలేక పోయారన్నది ప్రధానమైన అభియోగం. స్వయంగా ఆయనే అక్కడున్నా పరిస్థితి చక్కబడలేదు. ఇరువర్గాలు పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. ఈ రాళ్ల దాడుల్లో ఆయన కూడా గాయపడ్డారు. వరుసగా ఇవి చోటు చేసుకోవడంతో ఇది దేశ వ్యాప్తంగానూ చర్చనీయాంశమైంది. బుధవారం రాత్రికి పక్క జిల్లాల నుంచి ప్రత్యేక పోలీసు బలగాలొచ్చి మరింత రచ్చ చేశాయి. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అనుయాయుడు కిరణ్‌పై పోలీసులే దాడి చేసి తీవ్రగా గాయపరిచారని ఆరోపిస్తున్నారు. ఇందుకు గతంలో పనిచేసి వెళ్లిన డిఎస్పీ చైతన్య కారణమని టిడిపి నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్‌ను ఎన్నికల సంఘం సస్పెన్షన్ చేయడం చర్చనీయాంశమైంది. ఇక కింది స్థాయి అధికారులెవరేవరన్నది కూడా తేలాల్సి ఉంది. ఇక్కడ డిఎస్పీగా గంగయ్య ఉండగా, సిఐగా మురళీ కృష్ణ ఉన్నారు. ఈ దాడుల్లో మురళీ కృష్ణ తలకు గాయాలయ్యాయి. మరికొంత మందికి గాయాలయ్యాయి. అయితే వీరిలో ఎవరెవరిపై వేటు పడనుందన్నది చూడాల్సి ఉంది. ఎన్నికల సంఘం మాత్రం గట్టిగా హెచ్చరికలు చేస్తూ ఆదేశాలిచ్చింది. బాధ్యతలపై కఠినమైన చర్యలు ఉండాలని, వాటికి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు కేంద్ర ఎన్నికల సంఘానికి తెలియజేయాలని కూడా పేర్కొంది. దీంతో దిగువ స్థాయి అధికారుల్లోనూ గుబులు మొదలైంది.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత

◆ అనునిత్యం అప్రమత్తంగా ఉండాలి

◆ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సాధారణ ఎన్నికల నేపథ్యంలో జెఎన్‌టియులో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా॥వి.వినోద్ కుమార్ తెలియజేశారు. గురువారం నగరంలోని జెఎన్‌టియులో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల వద్ద భద్రతా చర్యలు అత్యంత పకడ్బందీగా ఉండాలన్నారు. కౌంటింగ్ వరకు అనునిత్యం అప్రమత్తంగా ఉంటూ గట్టి బందోబస్తు నిర్వహించాలన్నారు. భద్రతా చర్యల్లో ఎలాంటి అలసత్వం ఉండరాదన్నారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి రాంభూపాల్ రెడ్డి, తహశీల్దార్లు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి : డీఎస్పీలు

అనంతపురం క్రైం : జిల్లాలోని ఇవిఎంలను భద్రపరిచిన జెఎన్‌టియు స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అనంతపురం డీఎస్పీ టి.వి.వి ప్రతాప్, ఏ.ఆర్ డీఎస్పీ మునిరాజ సంబంధిత గార్డులను ఆదేశించారు. గురువారం స్థానిక జెఎన్‌టియు స్ట్రాంగ్ రూములను వన్‌టౌన్ సి.ఐ రెడ్డెప్పతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈ స్ట్రాంగు రూమ్‌ల వద్ద సాయుధ పోలీసులతో గార్డులు నిర్వహిస్తూ నిరంతర భద్రతను పరిశీలించారు. అంతేకాకుండా స్ట్రాంగు రూంల పరిసరాలలో ఫుట్ పెట్రోలింగ్, వజ్ర వాహనం ద్వారా గస్తీ కొనసాగిస్తున్నారు. సి.సి కెమేరాల ద్వారా భద్రతను పర్యవేక్షిస్తున్నారు. కౌంటింగు ముగిసే వరకు పటిష్ట భద్రత కొనసాగించాలని డీఎస్పీలు అక్కడ విధుల్లో ఉన్న సిబ్బందిని ఆదేశించారు.

అంతటా ఉత్కంఠ..!

◆ సార్వత్రిక ఎన్నికల గెలుపోటములపై సర్వత్రా చర్చ

◆ ఓటింగ్ శాతంపై అభ్యర్థుల లెక్కలు

◆ గెలుపుపై ఎవరి అంచనాలు వారివే..



ఉమ్మడి జిల్లాలో సార్వత్రిక ఎన్నికల సమరం హోరాహోరీగా జరిగింది. ప్రధానంగా టిడిపి, వైసిపిలు నువ్వానేనా అన్నట్లు ప్రచారాలు కొనసాగించారు. అదే ఊపుతో సర్వశక్తులూ ఒడ్డి పోలింగ్‌కు కష్టపడ్డారు. పోలింగ్ ముగిసన నేపథ్యంలో ఓటర్ల తీర్పు ఎలా ఉందన్న దానిపై అందరూ దృష్టి సారించారు. ముఖ్యంగా బరిలో నిలిచిన అభ్యర్థులు గ్రామాలు, వార్డుల వారీగా లెక్కలు తీస్తున్నారు. అనుకున్న దాని కంటే పోలింగ్ శాతం పెరగడం అభ్యర్థులకు కునుకు లేకుండా చేస్తోంది. పెరిగిన ఓటింగ్ శాతం దేనికి సంకేతం అన్న భావనలో అభ్యర్థులు ఉన్నారు.

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసి రెండు రోజులు అయ్యింది. పోలింగ్ అయితే ముగిసింది కానీ, గెలుపు మాత్రం ఇంకా పెండింగ్‌లో ఉంది. విజేత ఎవరన్నది తేలాలంటే ఏప్రిల్ 4వ తేదీ వరకు ఆగాల్సిందే. ఈ పరిస్థితుల్లో అభ్యర్థులు, ముఖ్య నాయకులు వారి సొంత సమీకరణలో ముందుకు వెళ్తున్నారు. ఏపె కేంద్రాల్లో తమకు అనుకూలంగా ఓట్లు పడ్డాయో లెక్కలు వేస్తున్నారు. గెలుపు ఓటములపై ఆయా గ్రామాలు, వార్డుల ముఖ్య నేతలతో చర్చిస్తున్నారు. టిడిపి, వైసిపి మధ్య ప్రధాన పోటీ జరిగిందని తేలడంతో ఫలితంపై ఆ రెండు పార్టీల ముఖ్య నాయకులు అంచనాలు వేస్తున్నారు. ఇక ఆయా పార్టీల మద్దతుదారులు సైతం ఏ పార్టీ గెలుస్తుందన్న దానిపై సర్వత్రా ఉత్కంఠగా ఉన్నారు. ఎవరికి వారు ఆయా కేంద్రాల్లో జరిగిన పోలింగ్ సరళిని బట్టి ఫలితాలను అంచనా వేస్తున్నారు. జిల్లాలో ఈ దసారి ప్రజలు ఓటువేసేందుకు పెద్ద ఎత్తున ఆసక్తి కనబరిచారు. ఆయా పార్టీలు ప్రచార సమయంలో ఇచ్చిన హామీలు, భవిష్యత్తులో చేయబోయే కార్యక్రమాల గురించి వారి ప్రసంగాల్లో పెద్ద ఎత్తునే చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఆహామీల అమలు కోసం ఓటర్లు రాత్రి వరకు క్యూలైన్‌లో నిల్చొని ఓట్లు వేశారా..? లేక ప్రభుత్వంపై వ్యతిరేకతా..? లేక అనుకూలతా..? అన్న విషయంపై నాయకులు అంచనాలు వేస్తున్నారు. టిడిపి, వైసిపి రెండు పార్టీలు గెలుపుపై ధీమాను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలు నియజకవర్గాల్లో రెండు పార్టీల అభ్యర్థులు విలేకరుల సమావేశం నిర్వహించి మరీ తాము భారీ మెజార్టీతో గెలువబోతున్నాం అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఇప్పటికే ఫలితాలపై బెట్టింగ్‌లు సైతం వేశారు. ఇలాంటి వారు పోలింగ్ సరళిపై మరింత ఎక్కువగా దృష్టి సారించి లెక్కలు వేస్తున్నారు.

20 రోజులు వేచి ఉండాలా..?

కౌంటింగ్‌కు ఇంకా 20 రోజుల సమయం ఉండడం చాలా మంది సహనానికి పరీక్షగా ఉంది. అన్ని రోజులు ఎలా వేచి ఉండాలంటూ సతమతం అవుతున్నారు. అభ్యర్థుల్లోనూ ఇదే పరిస్థితి కన్పిస్తోంది. అయితే గత ఎన్నికల్లో కౌంటింగ్‌కు పోలింగ్‌కు 40 రోజుల సమయం ఉండేదని, అంత సమయాన్నే గడిపామని ఇప్పుడు 20 రోజు ఏమంత పెద్ద లెక్కకాదంటున్నారు. ఎలాగో పోలింగ్ ముగిసిన నేపథ్యంలో ఖాళీ సమయం దొరకడంతో కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి ఉండేందుకు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నారు.

కుదుటపడుతున్న తాడిపత్రి

తాడిపత్రిలో అరెస్టు చేసిన వారిని పోలీసు స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

◆ ముఖ్య నేతలు అరెస్టు, తరలింపులతో సద్దుమణిగిన వాతావరణం

◆ ఇరు పార్టీలకు చెందిన 91 మందిపై కేసులు నమోదు

◆ ఉరవకొండ న్యాయమూర్తి ఎదుట నిందితుల హాజరు

◆ కొనసాగుతున్న 144 సెక్షన్

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం తాడిపత్రిలో టిడిపి, వైసిపి గ్రూపుల మధ్య రాజుకున్న వివాదం రెండు రోజుల పాటు కొనసాగింది. ఒకరిపై ఒకరు దాడులు ప్రతిదాడులతో తాడిపత్రి అట్టుడికింది. పెద్ద సంఖ్యలో మోహరించిన పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో గురువారం నాటికి పరిస్థితులు కాస్త కుదుటపడ్డాయి. ఘర్షణలను నివారించే క్రమంలో భాగంగా ఇరు పార్టీలకు చెందిన ముఖ్య నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని పక్క జిల్లాలకు తరలించారు. బుధవారం మొదలుపెట్టిన ఈ ఆపరేషన్‌తో ఇరు పార్టీలకు చెందిన దాదాపు 91 మందిపై కేసులు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నాయకులందరూ పోలీసుల అదుపులో ఉండడంతో గురువారం నాడు తాడిపత్రిలో ఎలాంటి ఘర్షణ చోటు చేసుకోలేదు. అరెస్టు చేసిన 91 మందిని జిల్లాలోని ఉరవకొండ మెజిస్ట్రేట్ వద్ద గురువారం హాజరు పరిచారు. అనంతరం వారందరికీ రిమాండ్ విధించి మరికొన్ని రోజులు ఘర్షణలకు పాల్పడకుండా వారిపైన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. అరెస్టులు భయంతో దాదాపు తాడిపత్రి పట్టణ, మండల నాయకులు అజ్ఞాతంలోకి వెళ్లారు.

పోలీసుల అదుపులో జెసి ఇంటి పనిమనుషులు

ఘర్షణలకు తావు లేకుండా చేయడంలో భాగంగా పోలీసులు తీసుకున్న నిర్ణయాల్లో భాగంగా బుధవారం మొదలుపెట్టిన ఆపరేషన్‌లో జేసీ.ప్రభాకర్‌రెడ్డి ఇంట్లో పనిచేస్తున్న పనిమనుషులను సైతం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇంట్లో పనిచేయడానికి ఎవరూ లేకపోవడంతో మందులు, ఆహారం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మాజీ ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి స్వయానా పోలీస్ స్టేషన్‌కు వచ్చి పనిమనుషులను వదిలిపెట్టాలని పోలీసులను కోరారు.

హైదరాబాద్‌కు జెసి కుటుంబ సభ్యులు

తాడిపత్రిలో ప్రస్తుతం నెలకొన్న శాంతిభద్రతల దృష్ట్యా మాజీ ఎంపీ జేసీ.దివాకర్ రెడ్డి కుటుంబ సభ్యులను పోలీసులు హుటాహుటిన హైదరాబాద్‌కు తరలించారు. జేసీ దివాకర్ రెడ్డి, ఆయన కుమారుడు జేసీ పవన్ కుమార్ రెడ్డితో పాటు వారి కుటుంబ సభ్యులను పోలీసులు హైదరాబాద్‌కు పంపించారు. పని మనుషులు ఎవరినీ ఇంట్లోకి పంపని విషయం తెలుసుకున్న జెసి.దివాకర్ రెడ్డి తనయుడు జేసీ పవన్ కుమార్ రెడ్డి హైదరాబాద్ నుంచి తాడిపత్రికి వచ్చారు. ఈ సమయంలో పవన్‌ను కూడా ఇంట్లోకి పంపేందుకు పోలీసులు అంగీకరించలేదు. తన తల్లి అనారోగ్యంతో ఉంటే ఇంట్లోకి వెళ్లొద్దంటూ అడ్డుకుంటున్న పోలీసులపై పవన్ మండిపడ్డారు. తాడిపత్రిలో ఉండడానికి వీలు లేదని తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చి, జేసీ కుటుంబ సభ్యులు అందరినీ భద్రత మధ్య హైదరాబాద్ తరలించారు.

కఠినంగా 144 సెక్షన్

ఎన్నికల ఘర్షణలు జరిగిన నేపథ్యంలో తాడిపత్రిలో 144 సెక్షన్‌ను కఠినంగా అమలు చేస్తున్నట్లు పోలీసు అధికారులు ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఏ పార్టీకి చెందిన వారైనా ఘర్షణలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని తెలియజేశారు. మంగళవారం నాడు తాడిపత్రిలో జరిగిన ఘర్షణలో పాల్గొన్న వారందరినీ అరెస్టు చేస్తామన్నారు. ఎవరినీ వదిలే ప్రసక్తే లేదన్నారు. ప్రస్తుతం అరెస్టు అయిన వారందరినీ ఎన్నికల ఫలితాలు విడుదల అయ్యేంతవరకు వదిలిపెట్టమని పోలీసులు హెచ్చరించారు.

ఎన్నికల నిధులన్నీ 'స్వాహా'..!

◆ విధుల్లో ఉన్న సిబ్బందికి మొండి చేయి

◆ పైసా కూడా ఇవ్వని అధికారులు

◆ లక్షలాది రూపాయలు మింగేసిన వైనం

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర ఎంతో కీలకమైంది. అధికారులతో పాటు బీఎల్‌వోలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ల పాత్ర మరింత కీలకం. ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్ అవసరమైన మేరకు నిధులు కేటాయిస్తుంది. ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు ఎన్నికల విధుల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ రెండు రోజులకు గాను గౌరవ వేతనం చెల్లిస్తుంది. అయితే అనంతపురం జిల్లాలో మాత్రం అధికారులు గౌరవ వేతనం చెల్లించకుండా లక్షలాది రూపాయలు స్వాహా చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.

అనంతపురం రూరల్ మండలంలో 84 మంది బీఎల్ఓలు, 35 మంది ఏఎన్ఎంలు, 96 మంది ఆశా వర్కర్లు ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు. వీరికి ఒక్కొక్కరికీ రోజుకు రూ.250 చొప్పున రెండు రోజులకు రూ.500 పారితోషికంగా చెల్లించాలి. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్‌లకు పారితోషికం చెల్లించిన అధికారులు కింది స్థాయి సిబ్బందికి మాత్రం మొండిచేయి చూపి స్వాహా పర్వానికి తెరలేపారన్న చర్చ ఎన్నికల సిబ్బందిలోనే జరుగుతోంది. రూరల్ మండలంలో 84 మంది బీఎల్ఓలకు రూ.500 చొప్పున రూ.42,000, 35 మంది ఏఎన్ఎంలకు రూ.500 చొప్పున రూ.17,500, 94 మంది ఆశా వర్కర్లకు రూ.500 చొప్పున 47,000 పారితోషికంగా చెల్లించాల్సి ఉండగా ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం గమనార్హం. దాదాపు అంతా కలిసి రూ.రూ.1,06,500 స్వాహా కు పాల్పడినట్లు సమాచారం.

బీఎల్ఓలకు ఇవ్వాల్సిన డబ్బులూ స్వాహా

ఎన్నికల విధులకు సంబంధించిన పారితోషికంతో పాటు బీఎల్ఓలకు ఇవ్వాల్సిన డబ్బులూ స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. రూరల్ మండలంలో 84 మంది బీఎల్ఓలు విధులు నిర్వహిస్తున్నారు. సంవత్సర కాలంగా ఓటరు జాబితాలపై పకడ్బందీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇందుకు గాను వీరికి నెలకు రూ.500 చొప్పున ఒక్కొక్కరికీ రూ.6 వేలు పారితోషికంగా చెల్లించాల్సి ఉంది. ఇలా 84 మందికి రూ.5.04 లక్షలు చెల్లించాలి. సంవత్సర కాలంగా కష్టపడి విధులు నిర్వహించామని, పారితోషికం ఇవ్వకుండా తమ పొట్ట కొట్టడం ఎంత వరకు సమంజసమని బీఎల్ఓలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ పారితోషికం తమకు ఇప్పించాలని కోరుతున్నారు.

రెవెన్యూ స్థలం కబ్జాయత్నం

ప్రహరీ పడగొట్టి మరీ ఆక్రమణ

కాంపౌండ్‌ను పగలగొట్టి, దారి కోసం నిర్మించిన కల్వర్టు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

ప్రభుత్వ యంత్రాంగమంతా సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో తలమునకలైన వేళ రాయదుర్గం పట్టణంలో అధికార పార్టీ నాయకులు విలువైన స్థలాల ఆక్రమణలకు తెర లేపారు. పట్టణంలోని శాంతినగర్ వైఎస్ఆర్ విగ్రహం వెనుక సర్వే నెంబర్ 225-ఎలో 0.82 సెంట్ల స్థలం ఉందని రెవెన్యూ అధికారులు తెలిపారు. కొంత స్థలం ఆక్రమణలకు గురి కాగా, మిగిలిన స్థలం ఆక్రమించకుండా భవిష్యత్తు అవసరాల దృష్ట్యా అప్పట్లో తహశీల్దార్‌గా పనిచేసిన ఖతీజున్‌కుప్రా తగిన చర్యలు తీసుకున్నారు. హౌసింగ్ అధికారులతో మాట్లాడి స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించారు. హౌసింగ్ నిధులతో నిర్మాణం చేపట్టిన ఈ ప్రహరీకి గేటు కూడా ఏర్పాటు చేశారు. ఇటు వైపు నుంచి వెళ్లేందుకు కాస్త దారి వదలమని ఆనుకొని భూమి ఉన్న యజమానులు అభ్యర్థించడంతో దారి కోసం 15 అడుగుల మేర స్థలాన్ని వదిలి ప్రహరీ నిర్మాణం చేపట్టినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. భూ యజమానులు ప్లాట్లు వేసి విక్రయించారు. కొందరు అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులు రెవెన్యూ వారు ఏర్పాటు చేసిన ప్రహరీని క్రమక్రమంగా పడగొట్టినట్లు సమీపంలో నివసిస్తున్న ప్రజలు ఆరోపిస్తున్నారు. నాలుగు వైపులా ఉన్న ప్రహరీ మధ్యలో లేఔట్‌లోకి వెళ్లేందుకు అనుసంధానంగా మట్టి రోడ్డు ఏర్పాటు చేసుకున్నారు. ఇది చాలదన్నట్లు ప్రహరీ ముందు భాగంలో ఇటీవల(ఎన్నికల వేళ) ఏకంగా కల్వర్టు నిర్మించారు. ప్రజాప్రతినిధి అండతో ప్రహరీనీ క్రమ క్రమంగా కూల్చివేస్తూ వచ్చారని స్థానికులు పేర్కొంటున్నారు. విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించాలనే ఉద్దేశంతో పాటు, లేఅవుట్‌లోకి వెళ్లేందుకు అనువుగా ప్రహరీని కూల్చివేశారు. కొందరు ఇదే అదనుగా గతంలో ఉన్న రెవెన్యూ అధికారుల సంతకాలతో నకిలీ పొజిషన్ సర్టిఫికెట్లు సృష్టించారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ కిషోర్‌ను వివరణ కోరగా అది రెవెన్యూకు సంబంధించిన స్థలం మున్సిపాలిటీ పరిధిలోకి రాదన్నారు. పట్టణ విఆర్ఓ ఉమేష్‌ను వివరణ కోరగా ఇప్పటికే ఈ విషయం అధికారుల దృష్టికి వచ్చిందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రహరీని పడగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని, స్థలం ఆక్రమణకు కాకుండా ప్రహరీ నిర్మించాలని పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

భారీ వాహనాల రాకపోకలు.!

తరచూ ప్రమాదాలు.. ఆందోళనలో ప్రజలు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మలుపులో వెళ్తున్న భారీ వాహనం

మండలంలోని కణేకల్లు-బళ్లారి ప్రధాన రహదారి ఇరుకుగా ఉండడం, దీనికి తోడు మలుపులు ఉండడంతో జిందాల్ ఫ్యాక్టరీకి చెందిన భారీ వాహనాలతో ఎప్పుడు ఏమి జరుగుతుందో అని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో జిందాల్ ఫ్యాక్టరీకి సంబంధించిన పెద్ద పెద్ద వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఇరుకు రోడ్డు, ఆపై మలుపుల ఉండడంతో ఇప్పటికే పలుమార్లు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరిగింది. ఆయా సమయాల్లో ప్రమాద బాధిత కుటుంబాలకు జిందాల్ ఫ్యాక్టరీ యాజమాన్యం కంటి తుడుపు చర్యలతో సరిపెట్టింది. జిందాల్ ఫ్యాక్టరీ వాహనాలు వంద అడుగుల పొడవు, 18 అడుగుల వెడల్పుతో ఉంటాయి. ఇలాంటి భారీ వాహనాలు నేషనల్ హైవే, ఫోర్ వే మార్గాల్లో మాత్రమే రవాణా చేయాల్సి ఉంటుంది. అయితే జిందాల్ ఫ్యాక్టరీ యాజమాన్యం భారీ వాహనాలను కణేకల్లు-బళ్లారి ప్రధాన రహదారిపై నడుపుతున్నా ప్రభుత్వం, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వాహనాలతో ప్రజల ప్రాణాలకు ముప్పు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిందాల్ ఫ్యాక్టరీ భారీ వాహనాలు తిరిగే మార్గంలో ఏడాది నుంచి బళ్లారి నుంచి బొమ్మనహాల్ వరకూ తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పోలీసులు కేసు నమోదు చేసిన దాఖలాలు లేవనే చెప్పాలి. ప్రమాదం జరిగినప్పుడు ప్రయివేటు వ్యక్తులు జోక్యం చేసుకుని దుప్పటి పంచాయితీ చేసి ఎంతో కొంత బాధిత కుటుంబాలకు ముట్టజెప్పడంతోనే సరిపెడుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ మార్గంలో భారీ వాహనాలను కట్టడి చేయాలి లేదా రోడ్డును మలుపులు లేకుండా భారీ వాహనాల రాకపోకలకు వీలుగా విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపైనే వ్యాపారాలు

రోడ్డుపై క్రయవిక్రయాలు-తీవ్రమైన ట్రాఫిక్-వాహనదారులకు తప్పనితిప్పలు

వ్యాపారులతో స్థానికుల వాగ్వాదాలు-నార్పల కూరగాయల మార్కెట్‌లో పరిస్థితి



రోడ్డుపైనే వ్యాపారాలు సాగిస్తున్న వ్యాపారులు

ప్రజాశక్తి-నార్పల

నార్పల పాత బస్టాండ్ సంత మార్కెట్ సందులో కిరాణా దుకాణాల ముందు కూరగాయలు పెడుతుండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. రూ.లక్షలు వెచ్చించి మార్కెట్‌ను నిర్మించినా వ్యాపారులు అక్కడ వ్యాపారాలు చేయకుండా రోడ్డుపై చేస్తుండటంతో సమస్య జఠిలమైంది. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్కెట్‌ను నిర్మించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని అప్పటి పాలకవర్గం సభ్యులు సర్పంచి ఆకుల నాగలలిత ఆధ్వర్యంలో స్థానిక కోటవీధిలో రూ.లక్షలు వెచ్చించి కూరగాయల మార్కెట్ నిర్మించారు. అనంతరం పంచాయతీ అధికారులు సంబంధిత దుకాణాలకు వేలంపాట కూడా నిర్వహించారు. ఆ సమయంలో రోడ్డుపై కూరగాయలు ఎవరూ అమ్మకూడదని తీర్మానం చేసి ఆదేశాలు జారీచేశారు. దీంతో కొంతకాలం బస్టాండ్ ఆవరణలో ట్రాఫిక్ సమస్య తొలిగిపోయింది. అయితే ఇది 'మున్నాళ్ల ముచ్చటగానే మారింది. కొందరు కూరగాయల వ్యాపారులు అధికారుల

వ్యాపారాలు జరగకపోవడంతో మూతబడిన మార్కెట్

మాటలను పెడచెవిన పెట్టి మార్కెట్‌లో వ్యాపారాలు సరిగా జరగడం లేదని స్థానిక సంత మార్కెట్ రోడ్డుపైకే వచ్చి కూరగాయలు విక్రయిస్తున్నారు. దీంతో నార్పలలో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారింది. సంత మార్కెట్ రోడ్డులో ఒక ద్విచక్ర వాహనం వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇందులో భాగంగానే ఇటీవల కొద్ది రోజుల క్రితం ఓ కూరగాయల వ్యాపారి రోడ్డులో కూరగాయల షెడ్డు వేయడం మొదలుపెట్టాడు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని పలువురు స్థానికులు అభ్యంతరం తెలపగా వ్యాపారులు, స్థానికులకు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదం చోటు చేసుకుంది. ఆఖరికి పోలీసు రంగ ప్రవేశం చేసి షెడ్డు వేయకుండా అడ్డుకట్ట వేయడంతోపాటు ఇరువురికీ సర్దిచెప్పారు. దీంతో సమస్య సద్దుమణిగింది. దీనికితోడు రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన మార్కెట్ నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా స్థానిక అధికారులు, పంచాయతీ పాలకవర్గం స్పందించి కూరగాయల మార్కెట్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని మండలవాసులు, వాహనదారులు కోరుతున్నారు. మామూలుగా వినియోగంలోకి తీసుకొస్తే ఫలితం ఉండదని, అధికారులు సీరియస్‌గా తీసుకుని తప్పనిసరిగా మార్కెట్‌లోనే క్రయవిక్రయాలు సాగించాలని హుకుం జారీ చేయాలని కోరుతున్నారు. ఇలా జనం కొన్నిరోజులు మార్కెట్‌లో క్రయవిక్రయాలకు అలవాటు పడితే యథావిధిగా అక్కడే వ్యాపారాలు కొనసాగుతాయని చెబుతున్నారు. దీనికితోడు ఇళ్ల ముందు డబ్బులు తీసుకుని కూరగాయలు పెట్టించే యజమానులకు నోటీసులు జారీ చేయాలని కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి భారీ ఎత్తున అపరాధ రుసుము విధిస్తేనే మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్యకు పూర్తిస్థాయిలో అడ్డుకట్టు వేయగలరని సూచిస్తున్నారు. ఆయా సూచనలపై అధికారులు, పాలకవర్గం దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమ అరెస్టులను ఆపాలి : వైసిపి లీగల్ సెల్

విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి లీగల్ సెల్ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

తాడిపత్రి అల్లర్ల ఘటనలో వైసిపి కార్యకర్తల అక్రమ అరెస్టులను ఆపాలని వైసిపి లీగల్ సెల్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పోలింగ్ రోజున ఓటింగ్ శాతాన్ని తగ్గించేందుకే మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్‌రెడ్డి అల్లర్లకు తెరలేపారన్నారు. ఓటింగ్ పెరిగితే వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దారెడ్డి గెలుస్తాడని కుట్ర పన్ని అల్లర్లకు పాల్పడ్డారన్నారు. కేవలం జెసి అస్మిత్‌రెడ్డిని గెలిపించేందుకు ఎస్పీతోపాటు ఎఎస్పీ, పోలీసు సిబ్బంది తాడిపత్రిలో రోజంతా అక్కడే మకాం వేశారని ఆరోపించారు. అల్లర్ల సందర్భంగా పెద్దారెడ్డి ఇంట్లోని పని మనుషులను కూడా చితకబాదడం బాధాకరన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమగ్రంగా విచారించి బాధ్యులపై చర్యలు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో లీగల్‌సెల్ అధికార ప్రతినిధి సుధీంద్రనాథ్, తాడిపత్రి లీగల్ సెల్ ఇన్‌ఛార్జి సత్యనారాయణరెడ్డి, నాయకులు ఉమాపతి, నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాయం

సాయం అందజేస్తున్న నిర్మలమురళి

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో విద్యార్థులకు సాయమందించారు. నగరంలోని హెచ్చెల్సీ కెనాల్ వద్ద వికలాంగుల బాలుర వసతి గృహంలో ఉన్న విద్యార్థులు కె.మహంతేష్, పి.ఇ.రమేష్, డి.వెంకటాద్రినాయుడు, కె.ఎర్రిస్వామి గ్రూప్-2 పరీక్షల్లో ప్రిలిమ్స్ పాసయ్యారు. మెయిన్ ఎగ్జామ్స్ కోసం చదువుకుంటున్నారు. వీరికి గ్రూప్-2 మెయిన్స్ ప్రిపేర్ అవడానికి పుస్తకాలు, మెటీరియల్స్, పరీక్ష రుసుం కోసం నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేసినట్లు ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలమురళి తెలిపారు. అలాగే అనురాధ సహకారంతో బియ్యం ప్యాకెట్ వితరణ చేశామన్నారు. విద్యార్థులు తమ లోపాన్ని అధిగమించి గ్రూప్-2లో ఉత్తీర్ణత పొందడం గర్వకారణమన్నారు. ఆర్థికసాయం అందజేసినందుకు హాస్టల్ వార్డెన్ శ్రీనివాసులు ట్రస్టు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుడి మృతికి నివాళి

వజ్రకరూరు : విడపనకల్లు మండల పరిధిలోని పాల్తూరు గ్రామానికి చెందిన వైసిపి యూత్ లీడర్ మఠం గణేష్ తండ్రి మఠం బసవప్ప స్వామి (50) మృతికి పలువురు నివాళుర్పించారు. వసవప్పస్వామి గురువారం ఉదయం అస్వస్థతకు గురై మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపిపి కరణం పుష్పావతి, భర్త భీమిరెడ్డి, మాజీ వైస్ ఎంపిపి ఓబులేష్, తదితరులు పార్థివదేహానికి పూలమాలలు వేసి అంజళి ఘటించారు. అనంతరం రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. నివాళులర్పించిన వారిలో ఎంపిటిసిలు దాసరి వెంకటేష్, శివ, ఓబులేష్, షణ్ముఖగౌడ్, డిష్ వెంకటేష్, సొసైటీ ఛైర్మన్ శ్రీరాములు, రాజశేఖర్, బుడ్డే ప్రసాద్, రామాంజనేయులు, సిద్ధప్పగౌడ్, నాగరాజ్, పొట్ట సుంకన్న, తదితరులు ఉన్నారు.

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ

బొమ్మనహాల్ : ప్రపంచ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని బొమ్మనహాల్, శ్రీధరఘట్ట, దర్గాహొనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్య సిబ్బంది గురువారం డెంగీ జ్వరం నివారణపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. అనంతరం సూపర్ వైజర్లు మాట్లాడుతూ గ్రామాల్లో పగటి దోమల పట్ల ప్రజలు జాగ్రత్త వహించాలన్నారు. పగటి దోమలు ప్రాణహాని కలిగిస్తాయన్నారు. నిల్వ ఉన్న నీటిలో ఉండే దోమలు రాత్రి వేళ నిద్రిస్తాయి పగటి వేళ ప్రజలను కాటేస్తాయని వివరించారు. వాటి నుంచి రక్షణ పొందాలంటే మన ఇంటి చుట్టూ ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ర్యాలీలో సూపర్‌వైజర్లు, నర్సులు, ఆశా వర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

మార్కెట్లోకి మారుతీ సుజుకీ న్యూ స్విఫ్ట్

అనంతపురం : నగరంలోని జయలక్ష్మి మారుతీ షోరూంలో నూతన స్విఫ్ట్ కారును గురువారం ఆవిష్కరించారు. సరికొత్త టెక్నాలజీ, నూతన హంగులు, అత్యాధునిక సౌకర్యాలతో తయారు చేసిన సరికొత్త మారుతీ న్యూ స్విఫ్ట్ కారు మార్కెట్లోకి ఆవిష్కరించినట్లు షోరూం జనరల్ మేనేజర్ గిరి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్‌బిఐ రీజినల్ మేనేజర్ రమేష్‌బాబు, సోషల్ మీడియా ప్రతినిధులు డాక్టర్ హరిప్రసాద్, జిఎన్‌ఎస్ వైభవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా ఆవిష్కరించిన షిఫ్ట్ మోడల్‌లో బేసిక్ స్థాయి నుంచి ఆరు సేఫ్టీ బెలూన్స్, నైన్ ఇంచెస్ టచ్ స్క్రీన్ వైర్లెస్ ఛార్జర్ స్పోర్ట్స్ మోడల్ తదితర నూతన సౌకర్యాలతో కొత్తకారును తయారు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో షోరూం రిలేషన్ షిప్ మేనేజర్ అనిల్‌కుమార్, టీం లీడర్లు రవితేజ, భాస్కర్, షోరూం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నూతన స్విఫ్ట్ కారును ఆవిష్కరిస్తున్న అతిథులు

ముంచుకొస్తున్న ఖరీఫ్..

జాడలేని విత్తన పంపిణీ-ఆందోళనలో అన్నదాతలు

దుక్కులు చేసుకుంటున్న రైతులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

ఖరీఫ్ పంటల సాగు దగ్గర పడుతున్నా అధికార యంత్రాంగం రైతులకు రాయితీ వేరుశనగ విత్తనం అందించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అటు అధికారులు, ఇటు పాలకులు బిజీబిజీగా ఉండటం వల్ల రైతులకు అందించే రాయితీ విత్తనంపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదని చెప్పవచ్చు. ఇప్పటికే రైతులు పొలాలను దుక్కులు చేసుకుని పంటల సాగుకు సన్నద్ధం అవుతున్నారు. పెద్దవడుగూరు మండల వ్యాప్తంగా దాదాపు 70వేల ఎకరాల్లో సాగు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. హెచ్చెల్సీ పరిధిలో సుమారు ఇరవైవేల ఎకరాలు ఉన్నాయి. మిగిలిన పొలాలు వర్షాధార, బోరు, బావుల కింద సాగవుతాయి. ఏటా మండలానికి వేరుసెనగ విత్తనం ఆరు వేల క్వింటాళ్లు అవసరం అవుతాయి. ఈఏడాది ఇంకా రాయితీ విత్తనం ఊసే కనిపించడంలేదని తెలుస్తోంది. ఈవిషయంపై మండల వ్యవసాయాధికారిణి మల్లీశ్వరిని విచారించగా మండలానికి ఇప్పటికే వెయ్యి క్వింటాళ్ల వేరుశనగ విత్తనం కోసం ప్రతిపాదనలు పంపామని త్వరలోనే రావచ్చునని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విత్తన కాయలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

డెంగీ నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం

డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీలు

ప్రజాశక్తి-వజ్రకరూరు

డెంగీ వ్యాధి నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయమని విడపనకల్ మండల పరిధిలోని పాల్తూరు పిహెచ్‌సి వైద్యాధికారులు అరుణకుమారి, శివశంకర్‌నాయక్ అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాల్తూరు గ్రామంలో అవగాహన సదస్సుతోపాటు ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా సిబ్బందితో కలిసి ఆయా కాలనీల్లో డెంగీపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పగటి పూట కుట్టే టైగర్ దోమ వల్ల డెంగీ వస్తుందన్నారు. డెంగీ సోకితే అధిక జ్వరం, తలనొప్పి, కీళ్లు, కండరాల నొప్పులు, కంటిలోపల ఎర్రగా మారి కనుగుడ్డు అటూ ఇటూ తిప్పలేకపోవడం, శరీరం మీద ఎర్రటి దద్దుర్లు వంటి లక్షణాలు కనిస్తాయన్నారు. సరైన వైద్యం పొందకపోతే ప్రాణాపాయం తప్పదని హెచ్చరించారు. కావున ప్రతి ఒక్కకరూ తమ ఇంట్లో, ఇంటి బయట నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న పాల్తూరు పిహెచ్‌సి వైద్యసిబ్బంది

పెద్దవడుగూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

పెద్దవడుగూరు : సమాజ భాగస్వామ్యంతో డెంగీ వ్యాధిని నిర్మూలించేందుకు కృషి చేద్దామని జాతీయ ఆరోగ్యమిషన్ జిల్లా అధికారి డాక్టర్ రవిశంకర్ పిలుపునిచ్చారు. గురువారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా పెద్దవడుగూరులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం డెంగీ వ్యాధి వల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఈవ్యాధి రాకముందే ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిలోని పలు దస్త్రాలు, మందులగది, పడకగదులను పరిశీలించారు. తర్వాత ఆసుపత్రికి వచ్చిన రోగులకు డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగలక్ష్మమ్మ, ఎంఎలెచ్పి శృతి, పావని, ఆరోగ్య సిబ్బంది సువర్ణ, జపీవుల్లా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎపిజిఎల్ బాండ్ సాధన సిఐటియు విజయం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేసే రెగ్యులర్ పారిశుధ్య కార్మికులకు ఎపిజిఎల్ బాండ్ సాధించటం మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు సాధించిన ఘన విజయమని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, నల్లప్ప, ముత్తురాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నో పోరాటాల ద్వారా రెగ్యులర్ ఉద్యోగులకు ఎపిజిఎల్ బాండ్ సాధించుకోవడం సంతోషంగా ఉందన్నారు. 12ఏళ్ల క్రితం ఎపిజిఎల్ బాండ్ ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిందన్నారు. అయితే (ఏ) బాండు మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులకు అందజేస్తున్నారన్నారు. 8ఏళ్లుగా సంవత్సరాలుగా రెగ్యులర్ ఉద్యోగులకు సంబంధించి వారి జీతంలో మినహాయిస్తున్న (బి, సి) రాని పరిస్థితి నెలకొందన్నారు. ఈ విషయంపై వచ్చిన ప్రతి కమిషనర్‌ను సిఐటియు ఆధ్వర్యంలో కలిసి విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. అయినా పట్టు వదలకుండా అలుపెరగని పోరాటం చేశామన్నారు. ఆఖరికి ప్రస్తుతం కమిషనర్ మేఘస్వరూప్ కృషి ఫలితంగా రెగ్యులర్ ఉద్యోగులకు ఎపిజిఎల్ బాండ్ సాధించుకున్నామన్నారు. ఇందుకు కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు.



ఎపిజిఎల్ బాండ్ పత్రంతో కార్మికులు, సిఐటియు నాయకులు

గొడవలు, అల్లర్లకు దూరంగా ఉండాలి

ఇటుకలపల్లి సిఐ నరేంద్రరెడ్డి

ప్రజలతో మాట్లాడుతున్న సిఐ నరేంద్రరెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు

అల్లర్లు, గొడవలకు దూరంగా ఉంటూ ప్రశాంతంగా జీవించాలని ఇటుకలపల్లి సి.ఐ నరేంద్రరెడ్డి సూచించారు. ఎస్పీ అమిత్‌బర్దర్ ఆదేశాల మేరకు ఎస్‌ఐ మునీర్‌అహ్మద్‌తో కలిసి గురువారం ఆత్మకూరు మండలం తలుపూరుకు వెళ్లారు. అక్కడ ప్రజలతో సమావేశమై గ్రామాలలో ప్రశాంతత లోపించకుండా అందరూ సహకరించాలన్నారు. చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని తెలియజేస్తున్నారు. అందరూ స్నేహ పూర్వకంగా మెలగాలన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE: ANANTHAPURAMU.

A.S. No. 46/223

Between:-

J.V.Ramana Kumar. **... Appellant.**

AND

P.Harinath. **...Respondent.**

NOTICE TO THE RESPONDENT

To,
P.Harinath S/0 P.Lakshmana Rao,
D.No.13-1-840, Revenue Colony,
Ananthapuramu.

Whereas the above named Appellant has instituted the Appeal against you for the Appeal mentioned relief, you are hereby summoned to appear in person or by a Pleader duly instructed and able to answer all material questions relating to the Appeal on 20-06-2024 at 10-30 A.M. in the forenoon in the above mentioned Hon'ble court, answer the claim in default of your appearance on the day mentioned, the Appeal will be heard and determined in your absence.

(By order of the Court)

S. ABDUL RASOOL,
S. MOHAMMAD IQBAL,
ADVOCATES: ANANTHAPURAMU.

యువత మంచిని గ్రహించాలి

ఎసిడిపిఒ అగిశం నాగమణి

మాట్లాడుతున్న ఎసిడిపిఒ అగిశం నాగమణి

ప్రజాశక్తి-గుత్తి

యువత మంచిని మాత్రమే గ్రహించి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఎసిడిపిఒ అగిశం నాగమణి సూచించారు. గురువారం మండలంలోని కొత్తపేట గ్రామ సమీపంలో ఉన్న హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో చిల్డ్రన్స్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్, హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ఫోక్సో చట్టం, ఆన్‌లైన్ వాడుకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల విద్యార్థులు సెల్ ఫోన్ వాడకం అధికమైందని దాని ద్వారా అనేక అనర్థాలకు దారి తీస్తున్నాయన్నారు. ముఖ్యంగా సెల్‌ఫోన్‌లో మంచిని మాత్రమే సేకరించాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అవరోధించాలని ఆకాంక్షించారు. అనంతరం లైంగిక, పునరుత్పత్తి, ఆరోగ్యం, బాలల హక్కులు అనే అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి అందులో విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ సీఈవో నారాయణస్వామి, ఉపాధ్యాయుని విశాల, డిసిపియు పిఒ వెంటేశ్వరి, హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది భాగ్యలత, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

	ANANTAPURAMU MUNICIPAL CORPORATION e-PROCUREMENT-Tender Notice.	
1	Tender Notice No.	01/2024-25/EE/TO, General Funds,
2	Scope of Work	Supply and delivery of Vaporized liquid chlorine Gas cylinders to Muddalapuramu filtration plant for the post chlorination of water Supply in Ananthapuramu municipal corporation
3	Estimate Cost Ranging	Rs. 9.75 Lakhs

Note:The details of tender may be seen on e-procurement market Place available @ **https://tender.apeprocurement.gov.in**

Sd/-
Commissioner
Municipal Corporation,
Anantapuramu

గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలో విద్యార్థుల సత్తా

గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

ప్రజాశక్తి-నార్పల

ఐదో తరగతి గురుకుల ప్రవేశ పరీక్షల ఫలితాల్లో మండల కేంద్రంలోని శిరిడీసాయి విద్యాలయం (ఆనంద్ సార్ స్కూల్) విద్యార్థులు సత్తాచాటారు. విద్యాలయంలో శిక్షణ తీసుకున్న బిల్లే మణి, జగన్మోహన్‌రెడ్డి, వినయ్, ప్రజ్ఞాసాయి 50 మార్కులకు 50 మార్కులు సాధించి జిల్లాస్థాయిలోనే ప్రథమ స్థానంలో నిలిచారు. గత కొన్నేళ్ల నుంచి గ్రామీణ ప్రాంతాల నుంచి వస్తున్న షిరిడీసాయి విద్యాలయం విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి వివిధ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు పొందారని పాఠశాల యాజమాన్యం తెలిపింది. అనంతరం విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు ఆనంద్‌ను తల్లిదండ్రులు సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

హుండీ లెక్కింపు

హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న మహిళలు

వజ్రకరూరు : ఉరవకొండ మండల పరిధిలోని పెన్నఅహోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం హుండీ లెక్కించారు. స్వామివారి ఆరు శాశ్వత హుండీలను దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో తెరిచి లెక్కించారు. 127 రోజులకు రూ.22,84,123 ఆదాయం వచ్చినట్లు పర్యవేక్షణాధికారి గ్రూప్ టెంపుల్స్, నార్పల కార్యనిర్వహణాధికారి జి.రంగస్వామినాయుడు, స్థానిక అలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ లెక్కింపులో హనుమాన్ సేవ సమితి, అవుట్ పోస్ట్ పోలీస్ ఎ.ఆయూబ్‌బాషా, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యాలను వెలికి తీయడమే లక్ష్యం

నిస్వార్థ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెంకట్

శిక్షణకు హాజరైన విద్యార్థులు

ప్రజాశక్తి-వజ్రకరూరు

విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయడమే లక్ష్యంగా 21 రోజుల వేసవి వికాస శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు నిస్వార్థ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెంకట్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉరవకొండలో 4, 9వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం సమయాల్లో వివిధ అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వారు చదువుతున్న తరగతుల్లో వెనుకబడిన అంశాల్లో వారిని ముందుకు తీసుకురావడం కోసం 21 రోజులపాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో 18 అంశాలపైన 20 మంది నిస్వార్థ ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా శిక్షణ ఇస్తున్నారన్నారు. ఏరోబిక్ డాన్స్, భగవద్గీత శ్లోక పఠనం, నీతి కథలు, ముగ్గులు, గానం, చిత్రలేఖనం, మంచి చేతిరాత, షటిల్, సెపక్‌తక్రా, ఖోఖో, ఫుట్‌బాల్, రూబిక్ క్యూబ్, పజిల్స్, చదరంగం, తెలుగులో చదవడం, రాయడం, ఇంగ్లీషులో చదవడం, రాయడం, గణితంలో ప్రాథమిక పరిక్రియలు వంటి వాటిపై తర్ఫీది ఇస్తున్నామన్నారు. శిక్షణలో దాదాపు 300 మంది విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. శిక్షణ తర్వాత వారు నేర్చుకున్న అంశాలపై పోటీలు నిర్వహించి విజేతలకు ఈనెల 23న ముగింపు సందర్భంగా బహుమతులు అందజేస్తామన్నారు.